# 2

# మీకు మీరుగా సాగడం!

## (1 తిమోతి 3:1-7)

దేవుని సంఘంలో పురుషులు ప్రధాన పాత్ర వహించాలని దేవుడు విధిని నియమించాడు. పురుషులు పెద్దలుగా, పరిచారకులుగా ఉండాలి. బహిరంగ ఆరాధనలను వారే నడిపించాలి దేవుడు ఎందుకిలా నియమించాడో నాకు తెలియదు అయితే, సామర్థ్యం, యోచన విషయంలో ఆడవారి కంటే మగవారు యుక్తమైన వారు అనేది మాత్రం దీనికి కారణం కాదు అన్నది మాత్రం నాకు తెలుసు. కారణమేదైనా, దేవుని ఆత్మీయ వ్యవస్థలో పురుషులే పెద్దలుగా నున్నారు. క్రైస్తవ పురుషులు సంఘాన్ని నడిపించేందుకు ముందుకు రాకుంటే దేవుని సంఘం సమస్యలో పడ్డట్లే.

ఒకసారి ఒక పుస్తక దుకాణంలో జీని. ఏ. గెట్జ్ చేత వ్రాయబడిన *ది మెజర్ ఆఫ్ ఏ మ్యాన్*[1] అన్న క్రైస్తవ పురుషుల నిమిత్తం వ్రాయబడిన పుస్తకం కనబడింది. నాకెంతో ఆనందంగా అన్పించింది. క్రైస్తవ స్త్రీలు ఎలా మంచి భార్యగా, తల్లిగా ఉండాలన్న విషయమై స్త్రీల నిమిత్తం ఎన్నో పుస్తకాలు వ్రాయబడ్డాయి. అయితే ఒక పురుషుడు ఎలా మంచి భర్తగా, తండ్రిగా ఉండాలన్న విషయమై ఎక్కువ పుస్తకాలు కనబడవు. తరువాత ఆ పుస్తకంలోని విషయ సూచిక విషయాలు చూశాక నిరుత్సాహం అన్పించింది. అందులోని అధ్యాయాలు 1 తిమోతి 3:1–7 మీదనే ఆధారపడ్డాయి. అయితే, "ఆ వచనాలు *పెద్దల* అర్హతలను గురించి అన్న విషయం గ్రంథకర్తకు తెలియదా?" అని నేను అనుకున్నాను. కానీ, దాని విషయమై నేను మరింతగా ఆలోచించే కొద్దీ ఆ వాక్యభాగం పురుషుని గురించి దేవుని ఆలోచనను *చెప్తుందని* నేను గుర్తించాను. ఈ పాఠంలో మనం 1 తిమోతి 3:1–7 వాక్యమును చూద్దాము. అలాగే వివరించబడిన లక్షణాలు పురుషులు కలిగియుండేలా ప్రోత్సాహమిద్దాం.

నా సవాలు 1వ వచనంలోని పదజాలం మీదనే కేంద్రీకృతమైయుంది. మనలో అనేకమందికి పదాలు పరిచయమే! "ఒక వ్యక్తి అధ్యక్షుడు అయ్యేందుకు *అపేక్షిస్తే*, అతడు మంచి పనిని అపేక్షిస్తున్నాడన్న మాట సత్యమే" (1 తిమోతి 3:1; నొక్కి చెప్పింది నాది). ఇంగ్లీషు KJVలో అపేక్షించడం ("desire") అన్న పదం రెండుసార్లు వాడబడింది. కానీ గ్రీకులో రెండు విభిన్న పదాలు వాడబడ్డాయి. దీన్ని NASB తర్జుమాలో చూడవచ్చు: "ఎవడైనను విచారణకర్త పదవికి *ఆశించిన* యెడల అతడు మంచి పనిని *అపేక్షిస్తున్నాడన్న* మాట సత్యము." NIVలో అయితే, "ఎవడైనను తన *హృదయ కాంక్షను* విచారణకర్త పదవి మీద ఉంచిన యెడల, అతడు గొప్ప పనిని *అపేక్షిస్తున్నాడు*" అని వ్రాయబడింది.

ఇక KJVలో వాడబడిన రెండో పదం "అపేక్షించడం." దీనికి "ఆశపడడం"[2] అన్న సాధారణ అర్థం ఉంది. దీన్ని మంచి అర్థంలో (ఆశించడం) అలాగే చెడు అర్థంలో (వాంఛించడం) వాడుకోవచ్చు. ఇక్కడిది మంచి అర్థంలో వాడబడింది మన దృష్టి మొదటి పదమైన KJVలో వాడబడిన "అపేక్షించడం," NASBలోని "ఆశించడం," NIVలోని "హృదయ వాంఛను కలిగియుండడం" మీదనే ఉంది.[3] ఈ పదాలన్నీ "చాచడం, సాగుట"[4]

అని అర్థమిచ్చు ఒక గ్రీకు పదము యొక్క అర్థమునుండి తర్జుమా చేయబడింది.

మనలో అనేక మందికి “చాచడం, సాగడం” అంటే ఏమిటో తెలుసు. బంధువులందరూ కూడుకునే కుటుంబ సమావేశాలకు మీరెప్పుడైనా వెళ్ళారా? అక్కడ భోజన సమయంలో, అందరూ తీసుకు వచ్చిన భోజనమును తినేందుకు మీరు బల్ల దగ్గర కూర్చున్నప్పుడు అందరికీ ఈ అనుభవం ఎదురయ్యే ఉంటుంది. మీకు కొంతదూరంలో బంగాళాదుంపలు ఉన్నప్పుడు, “కొంచెం వాటిని అందుకోండి” అని మీరు అడుగుతారు. ఏ ప్రతిస్పందనా ఉండదు. అందరూ మాట్లాడుకుంటూ నవ్వుతూ భోజనం చేస్తుంటారు “కొంచెం వాటిని అందుకోండి” అని మరలా అడుగుతారు. మరలా ఏ ప్రతిస్పందనా ఉండదు చివరిగా అడగడం మానేసి ముందుకు “సాగి వంగి” బంగాళాదుంపల గిన్నెను అందుకుంటారు. ప్రస్తుతం మనం చూస్తున్న పదం వెనుకనున్న ఆలోచన ఇదే.

అలాగే గ్రీకులో ఈ పదం మధ్యమ ప్రయోగం (the middle voice)లో ఉంది. మనలో అనేక మందికి ఈ వ్యాకరణ ప్రయోగం తెలియదు. ఇంగ్లీషు భాషలో సకర్మక ప్రయోగము active voice (మీరొక పని చేస్తున్నారు) అలాగే కర్మణి ప్రయోగం passive voice (నీకు ఏదో చేయబడింది) అని రెండు ప్రయోగాలు (voice) ఉన్నాయి. కానీ గ్రీకు భాషలో మూడవది కూడా ఉంది. అది మధ్యమ ప్రయోగంలో (middle voice), నీకు నీవే ఏదో చేసుకొనుచున్నావు. కాబట్టి, మన పదం విషయంలో మధ్యమ ప్రయోగంలో దీనికి “మీకు మీరుగా సాగడం, ముందుకు కొంచెం సాగడం”[5] అని అర్థమిస్తుంది. దీని ప్రకారం 1 తిమోతి 3:1 యొక్క అక్షరార్థ అర్థం ఇలా ఉంటుంది: “ఎవరైనా అధ్యక్షపదవి నిమిత్తం తనకు తానుగా ముందుకు వస్తే, అతడు ఒక మంచి పనిని ఆశిస్తున్నట్లే.”

తమకు నైపుణ్యం ఉన్న కళల్లో తాము ఉన్నతులుగా ఉండేందుకు తమకు తాము ముందుకు సాగే కొంతమందిని మనం చూస్తునే ఉంటాము. అలాగే వ్యాపార రంగంలోనూ విజయం సాధించేందుకు తమకు తాముగా ముందుకు సాగుతుంటారు కొంతమంది. మరి ఆత్మీయంగా ఎంత మంది ముందుకు సాగుతున్నారు! మీరు ఒకమంచి క్రైస్తవునిగా, మంచి దేవుని పిల్లలుగా ఉండేందుకు సాగడమే ఈ పాఠం యొక్క సవాలు.[6] ఇందులోని ప్రాథమిక విషయాలు ప్రత్యేకించి క్రీస్తు సహోదరులకు ఉద్దేశించినవే అయినా సహోదరీలకూ ఈ విషయాలు అన్వయించబడతాయి.

## ఆత్మీయంగా ఎదిగేందుకు మీకు మీరుగా సాగండి

సంఘ పెద్ద “క్రొత్తగా చేరినవాడై యుండకూడదు” అని 6వ వచనంలో చూస్తాము. ఈ “క్రొత్తగా చేరిన” వాడు (నూతనంగా మార్చబడినవాడు) అన్న పదం “neophyte,” అన్న మూల పదం నుండి వచ్చింది. దీనికి “క్రొత్త మొక్క” (నూతనంగా విత్తబడింది) అని అర్థం.[7] మనలో ఎవ్వరమూ క్రొత్త మొక్కలుగానే ఉండిపోకూడదు. మనం ఎదగాలని హెబ్రీ గ్రంథకర్త ఈ మాటలలో చెప్తున్నాడు:

> కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసిన వారైయుండగా, దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను. మీరు పాలు త్రాగవలసిన వారేగాని బలమైన ఆహారము తినగలవారు కారు. మరియు పాలు త్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతి వాక్య విషయములో అనుభవము లేనివాడైయున్నాడు.

వయసు వచ్చిన వారు అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకును సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును (హెబ్రీయులకు 5:12-14).

కొంతమంది క్రైస్తవులు కొంచెములోనే తృప్తిపొంది జీవించేస్తుంటారు. మరికొంతమంది ఆత్మీయంగా ఒక స్థాయికి చేరుకుని అక్కడే ఉండిపోతుంటారు. "పెద్ద" అని అంటే "ఎదిగిన వారు" అని అర్థం. అయితే ఈ ఎదుగుదల అనేది శారీరకపరంగా కాదు గాని ఇది క్రీస్తులోని ఎదుగుదలను సూచిస్తుంది. కాబట్టి మనమందరమూ, "ప్రేమ గలిగి సత్యము చెప్పుచూ క్రీస్తువలె ఉండుటకు మనమన్ని విషయములలో ఎదుగుదుము" (ఎఫెసీయులకు 4:15).

## మరింత దైవికంగా ఉండేందుకు మీకు మీరుగా సాగండి

నాయకత్వం అనేది అర్హతల మీద ఆధారపడినట్లే, ఇది వ్యక్తిత్వం, *ప్రవర్తన* మీదను ఆధారపడియుంది. ఇది సాధారణ నాయకత్వం విషయంలోనూ నిజం! రాజకీయ రంగంలో న్యాయపర అర్హతలను బట్టి నాయకులుగా ఎదిగి, భయభక్తులు లేని జీవితం కారణంగా ఆ పదవులను పోగొట్టుకున్న వారి గురించి ఎన్నో ఉదాహరణలను ఇయ్యవచ్చు. ఆత్మీయ నాయకుల విషయంలోనైతే, ఈ సూత్రాలు మరింత ప్రధానం, సత్యమైనవి ఆత్మీయ నాయకులుగా పిలువబడుతున్న వ్యక్తి యొక్క అనైతిక జీవితం బయటపడితే అది ఎంత సిగ్గుచేటు!

దైవిక వ్యక్తిగా ఉండే అవసరత గురించి వాక్యంలో ఎన్నో మార్లు చెప్పబడింది. 2వ వచనంలో అతడు "నిందారహితుడై" యుండాలని చెప్పబడడం చూస్తున్నాం. దీని అర్థం పరిపూర్ణుడై యుండాలని కాదు గాని, అతడు దేవునికి ఇష్టంగా జీవించేందుకు ప్రయత్నించువాడై యుండాలని అర్థం. ఇది సంఘంలో అతని వ్యక్తిత్వం గురించి చెప్తుంది. అలాగే సమాజంలోనూ అతడు సంఘమునకు *వెలుపటి వారిచేత* మంచి సాక్ష్యము పొందిన వాడైయుండాలని 7వ వచనంలో చెప్పబడింది.

2 మరియు 7 వచనాల్లోని పదాలు కేవలం బాహ్యంగా కనబడే లక్షణాలను గురించే గాక, లోపల నుండే వ్యక్తిత్వం నుండి బయటకు కనబడే ప్రవర్తన గురించి చెప్తున్నాయి. దీని సమాంతర వాక్యమైన తీతుకు 1:8లో "సజ్జన ప్రియుడు," "నీతిమంతుడు," మరియు "పవిత్రుడు" అన్న మాటలు కనబడుచున్నాయి.

## స్వీయ క్రమశిక్షణను నేర్చుకునేందుకు మీకు మీరుగా సాగండి

మనం నేర్చుకునే వాటిలో బహు కష్టతరమైనది స్వీయ క్రమశిక్షణ (self-discipline). "పరాక్రమశాలి కంటే దీర్ఘశాంతము గలవాడు శ్రేష్ఠుడు, పట్టణము పట్టుకొనువానికంటే తన మనస్సును స్వాధీన పరుచుకొనువాడు శ్రేష్ఠుడు" (సామెతలు 16:32) అని జ్ఞాని వ్రాస్తున్నాడు. అపొస్తలుడైన పౌలు కూడా ఈ విషయమై పోరాడుచున్నాడు. "గాలిని కొట్టినట్లు నేను పోరాడుట లేదు గాని ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేను భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి దానిని లోపరుచుకొనుచున్నాను" (1 కొరింథీయులకు 9:27) అని పౌలు అన్నాడు.

ఒక పెద్ద "మితానుభవుడై" యుండాలని 1 తిమోతి 3:2 చెప్తుంది. గ్రీకు పండితుడు.

జె. డబ్ల్యూ. రాబర్ట్స్ ఇలా వ్రాస్తున్నాడు, "దీని మూల పదానికి అర్థం ఏ విధమైన మత్తు పానీయములను దరిచేరనియ్యని వాడు అని. దాని రెండవ అర్థం స్థిరబుద్ధి లేదా స్థిరత్వం గలవాడు."[8] తన జీవితంలోని అన్ని విషయాల్లోనూ స్వీయ క్రమశిక్షణను అలవర్చుకున్న వ్యక్తి గురించి ఈ పదం చెప్తుంది.

తరువాతదిగా పెద్ద స్వస్థబుద్ధిగలవాడై యుండాలని తరువాతి వచనం చెప్తుంది. KJVలో ఆలోచనాపరుడు అని చెప్పబడగా, NIVలో "ఆత్మనిగ్రహం" గలవాడు అని చెప్పబడింది, దీనర్థం పెద్ద అనువాడు ఎన్నడూ నవ్వకుండా గంభీరంగా ఉంటాడని కాదుగాని, అతడు వివేకముగా ప్రవర్తించువాడు అని అర్థం.

తరువాత, పెద్ద "మర్యాదస్థుడై" యుండాలని ("మంచి ప్రవర్తన గలవాడు"; KJV)ఈ వాక్యం చెప్తుంది. దీని వెనుకనున్న గ్రీకు పదం ఒక ఆసక్తికరమైన పదం. ఇది *kosmos* పదం నుండి వచ్చింది. ఇదే ప్రపంచం. "లోకం" అన్న పదాలకు మూల పదం, దీనికి ప్రాథమికంగా "సరిగా నున్నది" లేదా "చక్కగా వ్యవస్థీకృతమైనది" అని అర్థం. ఈ పదం తన జీవితంలో అన్నిటిని క్రమపద్ధతిలో చక్కపరచిన వ్యక్తిని సూచిస్తుంది.[9]

మనం కూడా మితానుభవం, స్వస్థబుద్ధి, మర్యాదస్థులమై యుండేందుకు ముందుకు సాగుదాము. మనం స్వీయ క్రమశిక్షణను నేర్చుకుందాము!

### ఇతరులతో సఖ్యతగా ఉండేందుకు మీకు మీరుగా సాగండి

మన తోటి ప్రజలతో సత్సంబంధం కలిగియుండేలా మనం ముందుకు సాగడం మన తరువాతి సవాలు, ఇతరులతో సఖ్యతగా జీవించడం అన్నది మన ప్రాథమిక సామాజిక అవసరాలలో ఒకటి, భావ వ్యక్తీకరణ సాంకేతికంగా ఎంతో వృద్ధి సాధించినా, ప్రజలు ఇందులో ఇంకనూ విఫలమవుతున్నారు.

ఇతరులతో సత్సంబంధం కలిగియుండే అవసరత 3వ వచనంలో చెప్పబడింది. ఉదాహరణకు, ఒక పెద్ద "మద్యపానియు కొట్టువాడునుకాక" ఉండవలెను. అతడు కలహముల జోలికి "వెళ్ళకూడదు" అని CJBలో ఉంది. కొన్ని సమస్యలను కండబలంతో మాన్పివేయవచ్చని కొంతమంది భావిస్తుంటారు. (క్రైస్తవులు కాకముందు కొందరి జీవితాలు ఇలాగే ఉండడం మనం చూస్తున్నాము). ఓక్లహోమా సెనేట్‌లో ఇలాంటి ముష్టియుద్ధాన్ని నేను చూశాను. ఒక పెళ్ళి వేడుకలోనూ ఇలాంటి సన్నివేశాన్ని చూశాను. కానీ నేను పెద్దల కూడిక లేదా పురుషుల సహవాసంలో ఇలాంటి ముష్టియుద్ధాల్ని నేనెప్పుడూ చూడలేదు. కానీ కొన్ని ఆగ్రహావేశాలను చూశాను. ఏ పెద్ద, క్రైస్తవుడూ ఆలాగుండకూడదు.

వచనం చివరన ఒక పెద్ద "జగడమాడని వాడుగా"[10] (KJV) ఉండవలెను అని వ్రాయబడింది. ఈ పదానికి "తొందరపడువానిగా కాక," "కోపగించనివానిగాకాక" అని అర్థం (చూడండి తీతు 1:7). మనం సత్య ప్రియులుగా ఉండాలి (1 తిమోతి 6:12; 2 తిమోతి 4:7; యూదా 3; 1 థెస్సలొనీకయులకు 2:2), కానీ కలహ ప్రియులుగా ఉండకూడదు. కొంతమంది క్రైస్తవులు ఎక్కడికెళ్ళినా కలహాలను సృష్టిస్తుంటారు. వారు తగాదాను విత్తి వివాదాన్ని కోస్తుంటారు, మనమలా ఉండకూడదు.

మనం కలహమాడు వారముగా, జగడమాడువారముగా ఉండుకుండా సాత్వికులముగా ఉండాలి. ఇక్కడ వాడబడిన సాత్వికత అను పదం అనువదించేందుకు కష్టతరమైనది.

నా బైబిల్‌లో అది "శాంతము" అని ఇయ్యబడింది.[11] అంటే, చిన్న చిన్న తప్పులను క్షమించగలగడం. తరువాతదిగా మనం మాన్యత కలిగియుండాలని ఈ వచనం చెప్తుంది అనగా ఇతరులతో "సమాధానం" కలిగియుండాలి.

మనం చర్చిస్తున్న ఈ లక్షణం కేవలం వ్యతిరేక అర్థాన్ని (మనం జగడము *ఆడ కూడదు*) ఇచ్చేదే గాకుండా ఇది సానుకూల అర్థాన్ని కూడా ఇస్తుంది. మనం ఇతరులను ప్రేమించడం నేర్చుకోవాలి. దేవుని సంఘంలో, దాన్ని నడిపించేందుకు ఒక వ్యక్తి అందరితోనూ సరియైన సంబంధం కలిగియుండాలి. 2వ వచనంలోని అర్హతను చూడండి: "అతిథిప్రియుడు" దీనికి అర్థం "క్రొత్తవారిని సహితం ఆదరించువాడు"[12] పౌలు యొక్క రోజుల్లో నివాస అద్దె గదులు ఖరీదైనవిగా చెడు కార్యాలకు నిలయముగా ఉండేవి. ఆ రోజుల్లో వేసే నాటకాల్లో ఈ సంభాషణలు ఉండేవి. "నువ్వు ఎక్కడ ఆగుతావు?" అని మొదటివాడు ప్రశ్నిస్తే "ఎక్కడ పురుగులు తక్కువ ఉంటాయో అక్కడ" అని రెండవ వాడు సమాధానమిచ్చేవాడు.[13] ఈ అద్దె గదులు క్రైస్తవులకు ప్రమాదభరితంగా ఉండేవి. కాబట్టి క్రైస్తవులు తమ తోటి సోదరీ సోదరులు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతంనకు వెళ్తునప్పుడు, వారి నిమిత్తం వీరు తమ ద్వారాలను తెరిచియుంచాలన్నది దీని అర్థం.

"క్రొత్తవాడు" అన్న పదాన్ని మీ మనస్సులో అండర్‌లైన్ చేయండి మనకు ఎవరైతే బాగా పరిచయమో వారితో కల్సి మాట్లాడేందుకు, ఉండేందుకు మనం ఇష్టపడతాము, కానీ సంఘంలోని నాయకుడు అందరితోనూ స్నేహపూర్వకంగా ఉండాలి. క్రొత్తగా సంఘానికి వచ్చిన వారు బిడియపడకుండా సాదరణంగా ఆహ్వానించబడేలా, క్రొత్తవారిని ప్రోత్సహించేలా అతని మాటలు, ప్రవర్తన ఉండాలి. క్లుప్తంగా చెప్పాలంటే, నాయకుడు ప్రజలను ప్రేమించాలి. ఇతరులను ప్రేమించేందుకు, అందరితో సత్సంబంధం కలిగియుండేందుకు మనకు మనంగా ముందుకు సాగడం మన ముందున్న సవాలు.

## మీ ప్రాధాన్యతలను సవరించుకునేందుకు మీకు మీరుగా ముందుకు సాగండి

మన ప్రాధాన్యతలను సరిచేసుకోవడం మన తరువాతి సవాలు మీడియాలో ప్రకటించే వారు పదే పదే సంగతులను చెప్తూ మరియు యిలా చెప్పేవారు, "యివి జీవితంలో ముఖ్యమైనవి."[14] ఆత్మీయంగా ఎదిగిన స్త్రీ, పురుషులు మనకు కావాలి.

ధనాన్ని ప్రేమించే వారు గాకుండా, సంఘాన్ని ప్రేమించే వారు మనకు కావాలి. మరోవైపు సంఘ పెద్ద "ధనాపేక్షలేనివాడైయుండాలి" (3 వచనం).[15] అంటే "ధనాశలేనివాడై" యుండాలి. లోకపర విషయాలను అతనికి పెద్ద ప్రాముఖ్యమైనవిగా ఉండకూడదు. 5వ వచనంలోని ఈ పదాలను చూడండి: "దేవుని సంఘమును బాగుగా పాలించడం" (శ్రద్ధ వహించడం). మంచి సమరయుడు గాయపడిన వ్యక్తిని సత్రములో చేర్చినప్పుడు పూటకూళ్ళవానితో మాట్లాడుతూ ఇదే మాటను వాడతాడు. "ఇతని పరామర్శించుము [శ్రద్ధవహించడం] నీవింకేమైనను ఖర్చు చేసినయెడల నేను మరల వచ్చునప్పుడు. అది నీకు తీర్చెదను" (లూకా 10:35). ఏది అవసరమో దాన్ని తీర్చడం అని ఈ పదానికి ఇక్కడ అర్థం. సంఘం పట్ల శ్రద్ధ వహించడం అంటే, నాయకత్వం వహించడం అంటే, సంఘానికి ఏది అవసరమో దాన్ని అందించడం.

దేవుని కొరకు పని చేసేందుకు సంసిద్ధత గల వ్యక్తులు అవసరం. "అతడు దొడ్డపనిని అపేక్షించుచున్నాడు" (1 వచనం) అని పౌలు వ్రాస్తున్నాడు. అతడు మంచి పదవిని

అపేక్షించడం లేదు గాని మంచి పనిని అపేక్షిస్తున్నాడు. పని అనే పదం *erge* అన్న పదం నుండి వచ్చింది. దాన్నుండే మనం "శక్తి" ("energy") అన్న పదమును పొందాము. దేవుని పనిలో తమ శక్తిని విరివిగా వాడే వ్యక్తులు అవసరం.

మనం సంఘాన్ని ప్రేమిస్తున్నామని, దేవుని పనికి సంసిద్ధత గలవారమని చెప్పేందుకు గల ఒక మంచి మార్గం మనకు మనంగా బోధించేందుకు ముందుకు రావడమే! ఒక పెద్ద "బోధింపతగినవాడై" యుండాలని పౌలు వ్రాస్తున్నాడు. ఇది కేవలం బోధన సామర్థ్యం గురించే మాట్లాండడంలేదు, అతనిలోని బోధించే సంసిద్ధత, ఎలా బోధించాలో నేర్చుకునే ఉత్సాహం గురించి ఇది చెప్తుందనుకుంటున్నాను. మనమందరం బోధించేవారముగా ఉండాలని హెబ్రీయులకు 5:12 చెప్తుంది. "కాలమును బట్టి (క్రైస్తవులుగా ఉన్నకాలం) చూచితే మీరు బోధకులుగా ఉండవలసినవారు." "బోధింపతగినవాడై" యుండాలన్నది *బహిరంగ* బోధననే సూచించడం లేదు అని మనం గ్రహించాలి. ప్రతి తండ్రి తన పిల్లలకు బోధించాలి. మనమందరమూ మన విశ్వాసాన్ని ఏదో ఒక విధంగా ఇతరులకు పంచాలి. మీరు సంఘంలో పురుషులుగానున్న సభ్యులైతే బోధించేందుకు, మీకు మీరుగా సాగేందుకు మిమ్మల్ని సవాలు చేస్తున్నాను, కావున మీరు "బోధింపతగినవారై" ఉంటారు.

## మంచి కుటుంబ పాలకునిగా ఉండేందుకు మీకు మీరుగా సాగండి

సంఘ పెద్దగా ఉండేందుకు అందరికీ అన్వయించలేని రెండే రెండు అర్హతలు (1) అతడు క్రొత్తగా చేరినవాడై యుండకూడదు (2) వివాహితుడై విశ్వాసులైన పిల్లలు కలిగియుండాలి అని మునుపటి పాఠంలో మనం చూశాము. మీలో అనేకమంది ఎన్నో సంవత్సరాలుగా క్రైస్తవులుగా ఉన్నారు. మీలో ఎంతోమంది వివాహితులైయున్నారు, లేదా త్వరలో చేసుకుంటారు కాబట్టి నా చివరి సూచన దాదాపుగా అందరికీ, అన్వయించబడుతుంది: మంచి కుటుంబ పాలకునిగా ఉండేందుకు మీకు మీరుగా సాగండి. మన ప్రాధాన్యతలను సవరించుకునే విషయం ఇందాక మనం చర్చించాము. వివాహితుడైన క్రైస్తవునికి మంచి భర్తగా, మంచి తండ్రిగా ఉండడం కంటే ప్రాముఖ్యమైన ప్రాధాన్యతలు కొన్ని ఉన్నాయి.

సంఘాన్ని గురించి వివరించేందుకు రాజ్యం, దేహం, ద్రాక్షతోట, మంద, దేవుని సైన్యం వంటి ఎన్నో సాదృశ్యాలు క్రొత్తనింబంధనలో ఉపయోగించబడ్డాయి. అయితే "కుటుంబం" అన్న పదం కంటే మరింత అర్థవంత పదం మరొకటి కనబడదు. పెద్దలకుండాల్సిన అర్హతలను గురించి పౌలు తిమోతికి చెప్తూ "*దేవుని మందిరము* (యింటి)లో, నీవేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెను" (1 తిమోతి 3:15; చూడండి గలతీయులకు 6:10) అని వ్రాస్తున్నాడు. దీని నేపథ్యం చూస్తే, మందిరం (ఇల్లు) అన్న పదం కుటుంబాన్ని సూచిస్తుంది (4 వచనంతో పోల్చండి). పెద్దల పాలన విషయమై చెప్తూ, ఒకడు దేవుని కుటుంబమును పాలించాలంటే ముందుగా తన ఇంటిని బాగుగా పాలించడం నేర్చుకోవాలి అని వ్రాస్తున్నాడు.[16]

భర్తలుగా, తండ్రులుగా మనం నేర్చుకోవాల్సిన అనేక పాఠములను మన వాక్యభాగం అందిస్తుంది. ఉదాహరణకు, కుటుంబం పట్ల *బాధ్యతను* మనం నేర్చుకోవాలి. ఈ బాధ్యత 4 మరియు 5 వచనాల్లోని "ఏలడం" (*manage*) అన్న పదంలో సూచించబడింది:[17] "అతడు తన ఇంటివారిని బాగుగా ఏలువాడైయుండవలెను ... . ఎవడైనను తన ఇంటివారిని ఏలనేరక

పోయిన యెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును" ఏలడం (*manage*) అన్న పదం సంయుక్త గ్రీకు పదం నుండి వచ్చింది. దీనికి "ముందు నిలువబడడం"[18] అని అర్థం. ఒక కుటుంబం మందు నాయకునిగా ఎవరు "నిలువబడతారు"? దేవుడు (ఎఫెసీయులకు 5:23; 6:4). అయితే దేవుడు మన మీద ఉంచిన బాధ్యతను మనం *అంగీకరిస్తున్నామా?* అన్నదే అసలు ప్రశ్న.

మన భార్యల పట్ల మన బాధ్యతను మనం అంగీకరిస్తున్నామా? పెద్దయైన వాడు "ఏకపత్నీ పురుషుడుగా" ఉండాలని 2వ వచనం చెప్తుంది. పెద్దగా ఉండబోయే వ్యక్తి వివాహితుడై ఒక్కరే భార్యను కలిగియుండాలని ఇది చెప్తుంది. అయితే ఇందులో మరో అర్థం కూడా ఉందని నాకనిపిస్తుంది. "పెద్దగా ఉండబోయే వాడు. తన ఒక్క భార్యకు నమ్మకస్తుడైయుండాలని" తర్జుమా చెప్తుంది. ఒక స్త్రీకి భర్తగా ఉండడంలో ఏ ముందన్న విషయమై ఎఫెసీయులకు 5 చెప్తుందంటే: "పురుషులారా, మీరును మీ భార్యలను *ప్రేమించుడి.* అటువలె క్రీస్తు కూడా సంఘమును ప్రేమించి ... దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (25 వచనం; నొక్కి చెప్పింది నేను).

మన పిల్లల పట్ల మన బాధ్యతను మనం అంగీకరిస్తున్నామా? తండ్రుల నిమిత్తం ఎఫెసీయులకు 6:4లో ఇయ్యబడిన సవాలు మనకందరికీ తెలుసు: "తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోనూ బోధలోను వారిని పెంచుడి" ఇది నిజంగా గొప్ప సవాలే! అయితే, మన వాక్యభాగం మరింత పెద్ద సవాలును ఇస్తుంది: "సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీన పరుచుకొనవలెను" (1 తిమోతి 3:4బి). "తన పిల్లలు అన్ని విషయములలోనూ విధేయత కలిగి మర్యాదగా నుండునట్లు చూచుకొనవలెను" అని RSV అనువాదంలో ఉంది. పిల్లలు తండ్రి స్వాధీనములో ఉండి చక్కగా ప్రవర్తించునట్లు చూచుకోవాలి అని ఇతర తర్జుమాలు చెప్తున్నాయి (చూడండి CEV; Philips; LB). ఎంత గొప్ప సవాలు ఇది. తండ్రులారా మీ పిల్లలకు కొంత సమయాన్ని కేటాయించండి. మంచి తండ్రిగా ఉండడం ఎలాగో నేర్చుకోండి.

భర్తలుగా, తండ్రులుగా మనం నేర్చుకోవలసిన మరో పాఠం ఏమంటే, మన ఇంటిలో దేవుడిచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేయండి. 4, 5 వచనాల్లోని "ఏలడం" లేదా "పాలించడం" అన్న పదం సంబంధములకు సంబంధించినవి. ఇతరులు మన నాయకత్వాన్ని అనుసరిస్తున్నారంటే వారికి మనతోనున్న సంబందాన్ని బట్టి, మనమెవరమో వారు ఎరిగియున్నారు కాబట్టే.[19]

భర్తలు, తండ్రులుగా నున్న మనమందరమూ మంచి భర్త, మంచి తండ్రిగా ఉండేందుకు మనకు మనంగా ముందుకు సాగుదాము. పౌలు చెప్పిన విధంగా మన కుటుంబంలో పాలన సరిగా చేయలేకపోతే, ఇంక దేవుని ఇంటిని ఎలాగు పాలించగలము?

## ముగింపు

మన పాఠాన్ని ఇలా క్లుప్తీకరించవచ్చు: ప్రతిదినమూ క్రీస్తు*వలె* ఉండేందుకు మనకు మనంగా ముందుకు సాగుదాము. క్రైస్తవుని లక్షణాలన్నీ క్రీస్తునందే సంక్షిప్తంగా కనబడతాయి. అందులో "ఏకపత్నీ పురుషుడు" కూడా ఒకటి. ఒక్కతే భార్యయైన తన సంఘానికి క్రీస్తు భర్తయైయున్నాడు. తద్వారా భర్త ఎలా ఉండాలో ఆయన చూపించాడు. చివరిగా, ఆత్మీయ

ఎదుగుదల అంటే, క్రీస్తు వలె ఉండడం. ఎఫెసీయులకు 4:15లోని సవాలును మీకు గుర్తు చేస్తున్నాను! “క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదుము.”

రండి, ప్రార్థన చేద్దాం:

> పరలోకమందున్న మా తండ్రీ, ఈ సమయంలో పాఠాన్ని చదివిన పురుషులందరి పక్షమున నేను నీ సన్నిధికి వస్తున్నాను. నీ ఆత్మీయ రాజ్యంలో పురుషులే నాయకులుగా ఉండాలని నీవెందుకు చెప్పావో నాకు తెలియదు కానీ, మేము ఆ సవాలును బాధ్యతగా అంగీకరిస్తున్నాం. నీ సహాయం లేకుండా మేము ఆ సవాలును, బాధ్యతను నెరవేర్చలేమని మాకు తెలుసు. మా దోషములను బట్టి మేము నిస్సహాయులం తండ్రి. కాబట్టి మాకు సహాయం చేయండి. మేము ఎలా ఉండాలో చెప్పేందుకే నీవిచ్చిన 1 తిమోతి 3వ అధ్యాయం మరియు ఇతర సంబంధిత వాక్య భాగములను బట్టి నీకు కృతజ్ఞతలు. మేము ఎదిగేందుకు సహాయం చేయండి. మమ్మల్ని నడిపించండి, బలపరచండి, సహాయం చేయండి. మేము ఎలా ఎదిగియుండాలో అలా ఉండెందుకు తద్వారా నిన్ను ఘనపరిచేందుకు సహాయంచేయండి. మా గత దోషములను బట్టి క్షమించండి, రాబోయే రోజుల్లో తోడైయుండండి. యేసు నామంలో అడుగుతున్నాం తండ్రీ! ఆమేన్.

## గమనిక

క్రీస్తు నొద్దకు ఆహ్వానం పలుకుతూ మీరు ఈ ప్రసంగాన్ని ముగిస్తుంటే, ఒక వ్యక్తి దేవుని బిడ్డగా, నీటి మూలముగా ఆత్మ మూలముగా జన్మించేంతవరకు (యోహాను 3:5), మరియు సిర్థవిశ్వాసిగా బాప్తిస్మం పొందే వరకు (అపొస్తలుల కార్యములు 2:38). అతనిని సంఘం ఉపయోగించకూడదని గుర్తుంచుకోండి. అలాగే దేవునికి నమ్మకంగా లేని వారు ఆయన చేత వాడబడలేరని గుర్తుంచుకోండి. వారిని పునరుద్ధరించేందుకు ప్రయత్నించండి (గలతీయులకు 6:1; అపొస్తలుల కార్యములు 8:22, యాకోబు 5:16).

---

సూచనలు

[1]Gene A. Getz, *The Measure of a Man* (Ventura, Calif.: Regal Books, 1974). [2]KJVలో పాత ఇంగ్లీషు పదం “desireth” వాడబడింది. [3]పౌలు యొక్క దినాల్లో *orego* అన్న పదం సామాన్యంగా వాడబడగా, క్రొత్తనిబంధనలోనూ కొన్నిచోట్ల అది కనబడుతుంది. [4]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, Ltd., 1971), 291. [5]Ibid. [6]ఒక క్రైస్తవుడు ఎదిగేందుకు అన్ని చేసినా అతడు పెద్దగా ఉండేందుకు అర్హుడన్న నిశ్చియతలేదు అయితే, దేవుని పని నిమిత్తం అతడున్న స్థానంలోనే తనవంతు కృషిచేయగలడు. [7]*Neophyte*లో *neo* (క్రొత్త) మరియు *phuo* (ఎదుగుతున్న మొక్కను సూచిస్తుంది) అన్న రెండు పదాలున్నాయి. (*The Analytical Greek Lexicon,* 276, 431.) [8]J. W. Roberts, *Letters to Timothy*, The Living Word series (Austin, Tex.: R. B. Sweet Co., 1964), 28. [0]*The Analytical Greek Lexicon,* 238. [10]KJV అనువాదకులచేత ఇక్కడ వాడబడిన మరో పదం “కలహమాడనివాడు.”

[11]Alfred Marshall, *The Interlinear Greek-English New Testament,* 2d ed. (London: Samuel Bagster & Sons, Ltd., 1958), 824. [12]*Philoxenia* అనేది సంయుక్త పదం *phileo* (ప్రేమ) మరియు *xenos* (క్రొత్త వ్యక్తి). (Vine, 312.) [13]Aristophanes *The Frogs*. [14]మీరున్న ప్రాంతంలో “యిది మంచిది,” “ఇది ఇంకా బాగుంటుంది” అని చెప్పేందుకు ఆధారం ఎవరు? బహుశా కుటుంబ సభ్యులు లేదా పక్కింటివారు కావచ్చు. [15]KJV అనువాదకుల చేత వాడబడిన పదంలో రెండు పదాలకు “అవసరత కంటే ఆశించని వాడు” అని అర్థం KJVలో దీనికి “దుర్లాభమును ఆశించనివాడు” అని అర్థం. [16]కొంచెములో నమ్మకముగా ఉంటే, ఎక్కువ బాధ్యతలకు అందించబడతాడు అన్న సూత్రముకు ఇది సంబంధించి యుంది (చూడండి మత్తయి 25:21, 23). [17]KJVలో “ruleth” and “rule” అని ఉంది. “Rule” అంటే “ఒక దానిపై అధికారం

చెలాయించడం" అని అర్థం. కాని ఇక్కడి గ్రీకు పదం ఈ అర్థాన్నివ్వడం లేదు. [18]*Proistemi*లో రెండు పదాలున్నాయి *pros* ("ముందు") మరియు *histemi* ("నిలుచుట"). (Vine, 540.) [19]భర్త, తండ్రిగా భార్యలు, పిల్లలతో ఉండే సంబంధ నాయకత్వ విధానం ఒక ప్రాంతంలో ఒక విధంగా మరో ప్రాంతంలో మరో విధంగా ఉంటుంది. తండ్రి లేదా పెద్దలు నిరంకుషత్వాన్ని చూపకూడదు (చూడండి 1 పేతురు 5:3). తమ నాయకత్వం క్రిందనున్న వారి ఆశ, అభిప్రాయాలతో సంబంధం లేకుండా మూర్ఖంగా ఉండకూడదు. ఈ పేరాను మీ ప్రాంతానికనుగుణంగా మీరు వివరించవచ్చు.